కథ

# ఈ ప్రేమ చాలు!

– లంకపల్లి సంపత్ కుమార్

"మోనికా లెవెన్స్కీ లాంటిదే...ఆమె నా జీవితంలో...!" అన్నాడతను దూరంగా బుద్ధ విగ్రహం వెనగ్గా అస్తమిస్తున్న సూర్యుణ్ణి చూస్తూ.

నేనేం మాట్లాడలేదు. టాంక్‌బండ్ పై రెయిలింగ్‌ను ఆనుకుని నిలబడ్డాం.

"ఇలా జరుగుతుందని ఎవ్వరూ అనుకొని వుండరు..అవునా?" అన్నాడు సునీల్.


అర్ధం కాక "ఎవరు?" అన్నాను.

"బహుశా సంవత్సరం అయ్యిందనుకుంటా. ఇంకా జ్ఞాపకాలు నా జీవితంలో ఫ్రెష్ గానే వున్నాయి" అన్నాడు బాధగా.

"సునీల్..ఆమెను మర్చిపో..అనవసరంగా ఆమె గురించి నీ ఉద్యోగం పోగొట్టుకున్నావ్! పిచ్చివాడి లాగా ఆర్నెల్లు తిరిగావ్ చాలదా! నీకు నేను ఇచ్చే ఫ్రెండ్లీ అడ్వయిజ్ ఏమిటంటే మంచి అమ్మాయిని చూసి, పెళ్ళి చేసుకో" అన్నాను వాడినే గమనిస్తూ. హుస్సేన్ సాగర్ నీటినే చూస్తూ కూర్చున్నాడు.

"పెళ్ళి చేసుకోవాలనే కదా నీవు చెప్పేది? తప్పకుండా చేసుకుంటాను. ఇట్స్ టేక్స్ టైమ్... మచ్ టైమ్" అన్నాడు ఆలోచిస్తూ.

"ఇంతకూ క్లింటన్‌ను సమర్ధిస్తున్నావా?" అన్నాడు



మళ్ళీ.

"లేదు. అది చాలా తప్పు. నైతికంగా గొప్ప హోదాలో వున్న వారికి కొన్ని నియమాలుండాలి" అన్నాను ఆవేశంగా.

అతను ఏమీ మాట్లాడలేదు. మౌనంగా వుండిపోయాడు. అటుగా వెడుతున్న ఐస్‌క్రీం వాలాని పిలిచి రెండు తీసుకొని ఒకటి వాడికిచ్చి, నేను మరోటి తీసుకున్నాను. మౌనంగా ఐస్‌క్రీమ్ తినసాగాం.

ఏదో ఆఫీసులో పనుందని వచ్చాడు ఉదయం బెంగుళూరు నుంచి. రాత్రికి బస్‌లో వెళ్ళిపోతున్నాడు.

"రోజంతా ఎక్కడున్నావ్?" అని అడగలేదు నేను. ఎందుకంటే నేను అడిగినా చెప్పడు.

"పోనీ, రెండ్రోజులైనా వుండరాదూ" అన్నాను.

"లేదు. వెళ్ళిపోవాలి" అన్నాడు.

" బస్సుకు టైమ్ వుంది. ట్యాంక్ బండ్‌పై కూర్చుందాం కాసేపు" అన్నాడు.

"సరే" అన్నాను.

జేబులో నుంచి పర్స్ తీసి, అందులో నుంచి ఫోటో తీశాడు. దానినే చూస్తుండిపోయాడు.

"ఎవరిదా ఫోటో?" అన్నాను.

మాట్లాడకుండా నా చేతికిచ్చాడు.

నవ్వుతూ అందంగా వుంది ..వీణ!

"ఇది..ఇది..ఎలా వచ్చింది నీ దగ్గరకు..?" అన్నాను.

"ఎవరైనా ఇస్తే వస్తుంది" అన్నాడు మెల్లిగా.

"వద్దు..ఈ ఫోటో నీళ్ళల్లో పడేస్తాను" అన్నాను కోపంతో.

"వద్దు. ఉండనీ. ఒకరిచ్చిన జ్ఞాపకం. చెరిగిపోనీయకూడదు. నీవు చేసిన పనే నేనూ చేస్తానంటే ఏమందో తెలుసా? వద్దు నా ఫోటో నాకే ఇచ్చేయ్! అలా పడేయొద్దు" అంది.

"నీక్కావాలా? ఉంచేసుకో" అన్నాడు.

"నాకెందుకోయ్? నా మిత్రుణ్ణి మోసం చేసిన అమ్మాయి అని పేపర్లో వేయించనా?" అన్నాను.

"మోనికా..తన ఇష్టం తోనే కదా క్లింటన్ చుట్టూ తిరిగింది! ఏం చేసినా ఆనందంగా అనుభవించింది. అతడిచ్చిన ప్రజెంటేషన్సన్నీ ఆనందంగా పుచ్చుకుంది. మరి ఎందుకు తిరగబడింది? అవసరం లేని అభ్యంతరం ఇవ్వడెందుకు?" అన్నాడు సునీల్ వీణ ఫోటోను తన పర్సులో పెట్టుకుంటూ.

"ఏమైందో ఇద్దరి మధ్య! పెళ్ళి చేసుకుంటాడని ఆశపడిందటగా!" అన్నాను.

"అవును. ఆమె ఆడది. తన ఇష్టంతో తిరిగితే ఏమీ లేదు. తన కోరిక తీరలేదు కాబట్టి ఎదురు తిరిగింది. కోర్టుకు ఎక్కింది. తనకు పేరు రావాలి! ఎవ్వరైనా అడిగిరా! అప్పుడు మనసెం దుకు ఒప్పుకున్నావ్? ఆరోజే గొడవ చేయొచ్చుగదా! ఎందుకంటే ఆమె ఆడది, ఏమి చేసినా చెల్లుతుంది. తప్పు మగాడే అవుతుంది" అన్నాడు ఆవేశంగా. నేనేమీ మాట్లాడలేదు.

### గోవాలో మజా చేసుకున్న డింపుల్ కపాడియా


'బిజినెస్ టైకూన్ యునైటెడ్ బ్రూవరీస్' విజయ్ మాల్యా గోవాలో ఇచ్చిన పార్టీకి ముఖ్య అతిథిగా డింపుల్ కపాడియాని పిలిచాడట. అక్కడ డింపుల్‌ని చూసినవారంతా అసలు విషయం మరిచిపోయి ఆమె అందాన్ని పొగుడుతూ గడిపేశారట. మొత్తానికి కొవ్వొత్తుల వ్యాపారాన్ని డింపుల్ కపాడియా బాగా విస్తరింపజేస్తోందన్నమాట.



"అదే జరిగింది నా విషయంలో. కాని వీణను పెళ్ళి చేసుకోవాలనే అనుకున్నాను. అదే దృష్టితో చూశాను. మొదటి భార్య వదిలేసి వెళ్ళిపోయిన సంగతి తెలును. అసలు నుంచి నేను ఏదీ దాచలేదు. నా దగ్గరకు వస్తానంది. నన్ను నవ్వించింది. చివరకు నన్ను ఓ మోసగాడిగా ట్రీట్‌చేసి అవమానించింది" అన్నాడు దుఃఖంతో. వాడి చెంపలపై కన్నీటి చారలు లైట్ల వెలుగులో మెరిశాయి.

నేనేమీ ఓదార్చలేదు హృదయ భారం దించుకోవడంలో వాడికి సహకరించినట్టుంటుందని. మేము కూర్చున్న బెంచి పైన అతికించివున్న చాక్లెట్ రేపర్ను చూస్తూ కూర్చున్నాడు. అక్కడ నిచ్చిన గులాబి రేకులు కుప్పగా పడి వున్నాయి. ఆ రెమ్మలను ఆప్యాయంగా చేతుల్లోకి తీసుకున్నాడు.

"అంతగా నమ్మించి, మోసం చేయడమే కాకుండా ఓ చిన్న విషయానికే నన్ను అందరి మధ్యా



అవమానించి, ఊర్లోనే వుండకుండా చేసింది. ఆ రాక్షసిని మరచిపో" అన్నాను కసిగా.

ఏదో ఆలోచిస్తూ వుండిపోయాడు. సునీల్ హైదరాబాద్ లోనే పబ్లిక్ సెక్టార్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసేవాడు. పెళ్ళాం గొడవ పడి విడిపోయింది. వాడి జీవితంలో ప్రవేశించింది వీణ! పెళ్ళి చేసుకుంటానన్నాడు. చేసుకోమన్నాను. అదే ఆఫీసులో పనిచేస్తోందావిడ. మంచి టాలెంటెడ్ గాళ్ అన్నాడు. ఆ టాలెంట్ చూసే తాను 'ఫ్లాట్' అయ్యానన్నాడు. ఏం జరిగిందో తెలియదు. "మిగతా కొలీగ్స్‌తో అంత క్లోజ్‌గా ఎందుకుంటావ్?" అని అన్నాడట! అంతే, "నన్ను అవమానిస్తావా?" అని ఎంతో గొడవ చేసిందట! అది కాస్తా రాజుకొని, సునీల్ ఉద్యోగానికి రిజైన్ చేసే వరకూ వచ్చింది. ఆ అవమానంతోనే హైదరాబాద్ వదిలి వెళ్ళిపోయాడు. అన్నెల్ల తర్వాత బెంగుళూరులో మరో కంపెనీలో చేరాడు. సరిగ్గా సంవత్సరం తర్వాత ఫోన్ చేసి హైదరాబాద్ వస్తున్నానని చెప్పాడు. ఆశ్చర్యపోయాను. "ఏం పని?" అని అడగలేదు. రోజంతా ఎక్కడ తిరిగాడో తెలియదు. రాత్రికి వెళ్ళిపోతానన్నాడు. "సరే" అన్నాను. వెక్కి వెక్కి ఏడుస్తున్న శబ్దం వస్తే వాడిని చూశాను. రెండు చేతులతో ముఖం కప్పకొని ఏడుస్తున్నాడు. అప్పుడు వాడిని ఓదార్చడం ఫ్రెండ్‌గా నా కర్తవ్యం అనిపించింది. వాడిని నెమ్మదిగా దగ్గరకు తీసుకొని పదార్చాను. "మరచిపో..ఎందుకు బాధపడటం?" అన్నాను.

"ఎవరో ఒకాయన అన్నాడు దుఃఖం ప్రేమకు గుర్తని! హృదయంలో దుఃఖం వున్నంత సేపూ ప్రేమ నిలిచి వున్నట్టని! అది పోతే, ప్రేమ లేనట్టే. ఏమో! నాలో ఇంకా దుఃఖం మిగిలే వుంది!!" అన్నాడు. "అంటే ఆమె మీద ప్రేమ ఇంకా వుందంటావ్! నిన్నింతగా అవమానించి, ఉద్యోగం పోయేలాగా చేసినా..అస్సలు.." అని ఆ విషయం చెప్పాలని నోటి దాకా వచ్చింది. వెళ్ళేటప్పుడు చెబుతామలే అనుకుని మానేశాను.

"చెప్పలేను. ఆమె మీద కోపం మాత్రం లేదు. ఎందుకంటే ఆమె కూడా సామాన్యమైన స్త్రీ కాబట్టి. అలాగే ఆలోచిస్తుంది. ఓ తండ్రి తన కూతుర్ని, మరో అబ్బాయితో ఏ పార్కులోనో, సినిమా హాల్లోనో చూస్తే..దానికి ఆమె ఇచ్చే సంజాయిషీ ఏమంటే, "తప్పంతా అతనిదే..నేను ఫ్రెండ్లీగా వున్నానంతే.. అతనే రమ్మన్నాడు" అని ఆ నేరం అతనిపైనే వేస్తుంది. "అలాగా! ఆ రాస్కెల్‌ని తంతాను" అని తండ్రి దాం! ధూం! అని అబ్బాయినే తిడతాడు. ఇక్కడ అతడు అడగని విషయం, ఆమె చెప్పని విషయం ఏమిటంటే "అబ్బాయి రమ్మనగానే నువ్వెందుకెళ్ళావ్?" అని.

నాకు ఆశ్చర్యమేసింది. ఇంతా జరిగాక కూడా వాడు ఆమె గురించే ఆలోచిస్తున్నాడు.

"నువ్వు వెర్రి వాడివి. రోషం అస్సలే లేదు" అన్నాను కోపంగా. గట్టిగా నవ్వాడు సునీల్.

మానవ బలహీనతలుంటాయి. ఒక దగ్గర బాధపడి మరోదగ్గర రియాక్టవుతావు. వీణ విషయమే తీసుకుందాం. రెండవ పెళ్ళివాడ్నని తెలిసినా ప్రేమించింది. మరెందుకో బయటపడటం ఇష్టపడలేదు. ఆమె కారణాలు ఆమెకు వుండొచ్చు. నాకు చిన్నప్పటి నుంచీ నాది అన్నది నాకే సొంతం అనే 'సెల్ఫ్ పొసెసివ్ నేచర్' ఎక్కువ. అలాగే..వీణ నాది అనుకున్నాను. ఆమెను చూస్తే ఏదో ప్రేమ! ఆమెలో నాకిష్టమైనవి ..ఆ కళ్ళు..అలాగే.. ఆ కళ్ళల్లోకి చూస్తుండిపోవాలనుంటుంది. అదే అన్నాను వీణతో. 'నీ కళ్ళు నాక్కావాలి' అంటే 'ఏం చేసుకుంటావ్?' అంది. 'హృదయంలో దాచుకుంటాను' అని చెప్పాను. ఆ మూగ కళ్ళ ప్రేమ నాకే సొంతం కావాలి. ఆమె ఎవరితోనైనా 'క్లోజ్'గా వుంటే భరించలేకపోయేవాణ్ణి. అక్కడే నేను తప్పు చేశాను. అనవసరంగా ఆమె ఫ్రెండ్షిప్‌ను అపార్థం చేసుకున్నాను. ఆమెకు లేని సంబంధాలు అంటగట్టాను. ఆమె ఎంతగా హర్ట్ అయ్యిందో దానికి నిదర్శనమే....నన్ను బలిపశువును చేయడం.." అన్నాడు బాధగా.

"సరేలే వెళ్దాం!"అని బయల్దేరదీశాను. వాడు ఆప్యాయంగా బెంచికి అతికించిన చాక్‌లెట్ రేపర్‌ను ముద్దాడాడు. అక్కడ పడిపోయిన గులాబి రెమ్మలను తీసుకుని, జేబులో వేసుకున్నాడు. నాకు అదంతా పిచ్చిగా అనిపించినా, ఏమీ అనలేకపోయాను. ఆటోని కేకేసి ఎక్కి అడ్రస్ చెప్పాను.

"ఆమెకు పెళ్ళి నిశ్చయమయ్యిందట.." ఎలాగో చెప్పగలిగాను వాడు హర్ట్ అవుతాడని తెలిసినా. చివరకు వాణ్ణి బస్సెక్కించే ముందు చెప్పాను. బస్సు బయల్దేరడానికి అప్పటికి కొంచెం సమయముంది.

మౌనంగా విన్నాడు. ఏమీ మాట్లాడలేదు కాసేపు. ఆ తర్వాత వాడు మాట్లాడుతుంటే ఆశ్చర్యపోవడం నావంతయింది.

"పెళ్ళి చేసుకోకుండా ఎలా వుండగలదు! తప్పక చేసుకుంటుంది. ఆ విషయంలో నాకేమీ బాధ లేదు. నీకో విషయం చెప్పలేదు. ఈరోజు నేను ప్రత్యేకంగా రావడానికి కారణం..ఈ రోజు ఆమె బర్త్‌డే! పోయిన సంవత్సరం ఇద్దరం ఎంతో సరదాగా గడిపాం. గండిపేటకు వెళ్ళాం. దీనిలో సినిమా చూశాం. చివరగా..మనం కూర్చున్నాం చూశావా! అదే బెంచిపై ఇద్దరం కూర్చుని చాలా సేపు కబుర్లు చెప్పకున్నాం"...ఆగాడు నా వైపు చూసి. నాకెంతో ఆశ్చర్యమనిపించింది. నేనో అనే లోగానే సునీల్ మళ్ళీ చెప్పసాగాడు.

"రోజంతా అక్కడ్నే గండిపేటకు వెళ్ళాను. దీనిలో సినిమా చూశాను. మేమిద్దరం భోంచేసిన హోటల్‌లోనే భోజనం చేశాను. చివరగా...సాయంత్రం... ట్యాంక్‌బండ్ పైన గడిపాను. నా చివరి 'మజిలీ'లో నాకర్థమైన విషయం, నీకు తెలియంది...ఆ చాక్‌లెట్ రేపర్, గులాబీల రెక్కలు చెప్తాయ్" అన్నాడు.

"ఏం తెలుసుకున్నావ్?" అన్నాను ఎక్సయిటింగ్‌గా.

"వీణ వచ్చివెళ్ళింది...అక్కడే కూర్చుంది!" అన్నాడు. ఎలా..ఎలా చెప్పగలిగావ్?" అన్నాను.

"ఎందుకంటే, ఆరోజు మేమిద్దరం తిన్నది నేను కొన్న ఆ ఛాక్‌లెట్ కాబట్టి. ఆమె తలలోని గులాబీ అక్కడ పడితే , దాని రెక్కలు అన్నీ విప్పి, ఆమె తల మీద నేనే పోశాను" అన్నాడు కూల్‌గా.

"వీణ..వీణ..వచ్చిందా!"అన్నాను నమ్మకం కుదరక.

"ఐ కాంట్ బిలీవిట్" అన్నాను.

"వచ్చిందనే అనుకుంటున్నాను. ఒక వేళ రాకపోయినా ఫర్వాలేదు. ఆ చాక్‌లెట్ రేపర్, గులాబీలు మరొక జంటవైనా ఫర్వాలేదు... వీణకు పెళ్ళయినా ఫర్వాలేదు..." అన్నాడు.బస్సు కదలబోతుంది.

మళ్ళీ నాతో–

"నాకు మిగిలింది ఓ తృప్తి. వీణ హృదయంలో ప్రేమను రగిలించగలిగాను. ఆమె నన్ను ప్రేమించింది. చాలు.. ఆ ప్రేమ చాలు..." అన్నాడు బస్సులోకి ఎక్కేసి నాకు టాటా చెబుతూ. బస్సు కదిలింది మెల్లగా నేనింకా ఆశ్చర్యం నుంచి తేరుకోకముందే.



**చక్రవర్తి కొత్త ఇల్లు**

రామ్‌గోపాల్ వర్మ 'సత్య' సినిమా పుణ్యాన దేశం అంతా హీరోగా తెలిసిన చక్రవర్తి, బాలీవుడ్ నిర్మాత, దర్శకులకి అందుబాటులో వుండడం కోసం ముంబాయ్‌లో ఓ ఖరీదైన ఇల్లు కొన్నాడట. అంతేకాకుండా సునీల్ శెట్టి, షారుక్‌ఖాన్, అమీర్‌ఖాన్‌లతో సంబంధాలు పెట్టుకుని వాళ్ల ఇళ్లకి రాకపోకలు కూడా బానే సాగిస్తున్నాడట.